# యంత్రం

"మళ్ళీ పెళ్ళి!"

ఆ మాట చెవిని పడితే నాకు వళ్ళంతా జర్రులు పాకినట్లుంది. అమ్మతో చాలాసార్లు చెప్పాను. ఈపెండ్లి సంబంధాలు తెచ్చే ఖాలాబీలను మన యింటికి రానీవద్దని.

తెల్లారినప్పటి నుండి ఆ గడప, ఈ గడప తిరగడమే వాళ్ళ పని. ఆ యింట్లో కాఫీ, ఈ యింట్లో కాఫీ, ఒకచోట టిఫిన్, యింకోచోట భోజనం ఇదీ వరుస. పెండ్లీడు పిల్లల బాగోగుల్ని చిలకల్లా వల్లిస్తుంటారు. పట్నంలో ప్రతి ముస్లిం యింటి జాతకం చిటికెలమీద చెప్పేస్తారు. అందరి మంచీ, చెడ్డలు వాళ్ళ నోళ్ళల్లో నానుతూ ఉంటాయి.

నజరానాలు కాస్తా బలంగా ఇస్తామని ముందే ఆశ చూపెడతారు కొందరు. అటు వంటి వాళ్ళ బిడ్డల్ను గూర్చి ఓ అరగంట లేటుగా స్తోత్రం చేస్తారు. ఘరానా కుటుంబీకులుగా వాళ్ళకు తిరుగులేని ముద్ర వేస్తారు. ఫలానా వాళ్ళ సంబంధం మీ అదృష్టంకొద్దీ దొరుకుతూ ఉందని గోప్యంగా చెపుతారు. ఆ యింటి కోడలైతే నిజంగా మీ అమ్మాయి అదృష్టం పండినట్లే అంటారు.

సంబంధాలు పొసగించడానికి వాళ్ళుచెప్పే అపద్దాలకు అంతూ పొంతూ ఉండదు. ప్రస్తుతం ఈ పని చాలా లాభసాటి వ్యాపారంగా చెలామణి అవుతుంది.

ఈ మధ్య రాబియా ఖాలాబీ తరచూ మా యింట్లో దర్శన మిస్తూంది. పెళ్ళి కావాలసిన వాళ్ళెవరూ మా యింట్లోలేరు. మా అన్నలు ముగ్గురికి పెళ్ళిళ్ళు అయి పోయాయి. ఇద్దరి సంబంధాలు ఈ మహాతల్లే కుదిర్చింది. ఆ పరిచయం వల్ల వస్తూం దనుకొన్నాను మొదట్లో.

కానీ అమ్మతో గుసగుసలాడుతూంటే విన్నాను. నాకు మళ్ళీ పెళ్ళి చేస్తే బాగుంటుందని! 'ఇటీవలె ఒకతని భార్య చనిపోయిందట. నలుగురు చిన్న పిల్లలతో నానా తంటాలు పడుతున్నాడు. నిక్షేపమైన గవర్నమెంటు నౌకరీ. దండిగా జీతం వస్తుంది. మంచి సంబంధ ముంటే చూడమని ప్రతి రోజు బతిమాలుకుంటున్నాడు. మీరు సరేనంటే క్షణాల్లో మీ అమ్మాయికి కుదురుస్తా'నంటూంది. నేను వచ్చింది గమనించి గతుక్కుమన్నారు యిద్దరు. తర్వాత మాట్లాడు కుందామని మాట మార్చుకొన్నారు.

అప్పటి నుండి ఆమె మా యింటికి వస్తే గుండె లయ తప్పుతుంది నాకు. ఆమె ఉన్నంతసేపు నెత్తిన నిప్పుల కుంపటి పెట్టినట్లు బాధ. ఎప్పుడెప్పుడు పోతుందా అని నానా అవస్థ. పోయిన తర్వాతగాని మనస్థిమితం రాదు.

ఈరోజు మళ్ళీ వచ్చింది!

ఏ అవాంతరం ముంచు కొస్తుందోనని భయంగా ఉంది. నా గదిలో కూర్చొని కథల పుస్తకం చదువుతున్నాను. మనసుమాత్రం వాళ్ళను గురించే ఆలోచిస్తూంది. చెవులు వాళ్ళసంభాషణ మీదే లగ్నమయ్యాయి. పుస్తకం చూస్తున్నానేగాని, ఏమి అర్థం కావడంలేదు. రెండు, మూడుసార్లు గట్టిగా వినిపిస్తే నన్నే పిలిచారని ఉలిక్కి పడ్డాను.

మగరీబ్ నమాజ్ (సూర్య స్తమయం తరావ్త చేసే నమాజ్) ముగించి యింటికి వచ్చారు అబ్బాజాన్. శుక్రవారం కాబట్టి ఆరోజు బట్టలంగడికి పోలేదు. బస్తీలో పెద్ద బట్టల దుకాణం ఉంది. "సుల్తానా కట్‌పీస్ సెంటర్" అని షాపుకు నాపేరే పెట్టారు.

"అబ్బాయి తరపువాళ్ళను వచ్చి రజియా సుల్తానాను చూసి పొమ్మని చెప్పి పంపాను" అబ్బాజాన్ పక్కన చాపమీద కూర్చుంటూ చెప్పింది అమ్మీ.

అబ్బాజాన్ గంభీరంగా ఆమెవైపు చూశాడు.

"ఇద్దతు కాలం (విడాకు లిచ్చిన తర్వాత పెట్టే గడువు) దాటి మూడు మాసాలు కావొచ్చింది. ముసలి, ముతకానా మనం వూరుకోవడానికి. ఎంత కాలమని యింటిలో పెట్టుకోగలం, ఆమెకు మనమన్నీ సమకూర్చగలం, కానీ భర్తను యివ్వలేం కదా! ఒక్కగానొక్క బిడ్డ. 'అల్లా' ఆమెను ఇంత చిన్నచూపు చూస్తాడనుకోలేదు" దుఃఖంతో అమ్మీ గొంతు బొంగురు బోయింది. కన్నీళ్ళు గట్లు తెంచుకున్నాయి. ఏడుపును సంబాళించుకోవడానికి పైటతో నోరు నొక్కి పట్టుకుంది.

"ఊరుకో సలీమా! అల్లాకు ఏది ఇష్టమో అదే జరుగుతుంది. ఆమె తలరాతను తప్పించడం మన వశమా! నా బిడ్డ జీవితంలో వెలుతురు ప్రసాదించమని ప్రతి నమాజులో అల్లాను వేడుకొంటున్నాను. దయామయుడు తప్పకుండా నా మొర ఆలకించి నా తల్లిని చల్లగా చూస్తాడు."

ఆ మాటల్ని బట్టి అమ్మీ అభిప్రాయంతో అబ్బాజాన్ కూడా ఏకీభవించారు అను కొన్నాను. నాకు కంపర మెత్తింది. ఏం చేయాలో తోచక నా గదిలోకి పరుగెత్తాను.

ఇషాః నమాజ్ (రాత్రి ఎనిమిది గంటల తర్వాత చేసే నమాజ్) ముగించి వెంటనే మంచమెక్కాను. అన్నం తిని పడుకోమని అమ్మీ కేకలు పెడుతూంది. నాకు ఆకలిగా లేదంటే వినడం లేదు. కాదు కూడదని బలవంతం పెడితే ఒక గ్లాసు పాలు తాగాను.

ఎంత పొర్లినా నిద్ర రావడం లేదు. ఏవేవో ఆలోచనలు మనసును ముసురు కుంటున్నాయి. అప్పుడయితే రిజ్వానా నిద్ర ముందు చాలా గొడవ చేసేది. నా యెద మీద కూర్చొని ముసిముసిగా నవ్వేది. వచ్చీరాని మాటలతో 'అమ్మీ! అమ్మీ! అని నా బుగ్గల కేసి గుద్దేది. అంతలోనే పకపకా నవ్వుతూ ముఖమంతా ముద్దులు పెట్టేది. వాళ్ళ అబ్బా ఎంత బంగపడినా రానంటే రానని భీష్మించుకునేది. అది సందడి ముగించి నిద్రపోతే తప్ప తమకు ఏ పని తెమిలేది కాదు.

అది పుట్టినప్పటి నుండే నా కష్టాలు గట్టు తెంచుకున్నాయి. రిజ్వానాకు సరిగ్గా మూడేళ్ళు. నా కడగండ్ల వయస్సు కూడా అంతే.

నా పెండ్లి అయిన ఏడేండ్ల వరకు మా సంసారంలో సంబరాలు పండినాయి. అన్యో న్యత అల్లుకుపోయింది. పెండ్లయిన కొత్తల్లో రాజాఖాన్ నాతో ఏదన్నా మాట్లా డాలంటే సిగ్గు పడేవాడు. తాను ఇంటర్ ఫెయిల్. నేను బి.ఏ. పాసయ్యాను. తప్పులు పడతా నేమోనని అతని భయం.

రాజాఖాన్ తండ్రికి బస్తీలో పెద్ద జువెలర్స్ షాపు ఉన్నింది. ఆయన పోయిన తర్వాత వ్యాపారం రాజానే చూస్తున్నాడు. కొన్ని రోజులకే బిజినెస్‌లో తండ్రిని మించిన దిట్ట అని పించు కున్నాడు. అతని తండ్రితో ఉన్న స్నేహం కొద్దీ అబ్బాజాన్ పట్టుబట్టి నన్ను రాజాకిచ్చాడు.

యెర్రగా బొద్దుగా ఉంటాడు రాజా. నల్లని వుంగరాల జుత్తు. తెల్లని కళ్ళు. ముక్కు కొంచెం అణగి ఉన్నా చూపరులను ఆకట్టుకునే ముఖం.

వాళ్ళమ్మ కోరినంత కట్నం, జెహజు(వస్తు సామాగ్రి) కుమ్మరించారు మా వాళ్ళు. మా అత్తయ్య చాలా నెమ్మది మనిషి. నన్ను తన కూతురు కంటే మిన్నగా చూసేది. నా దుర దృష్టానికే అన్నట్లు, పెద్దమ్మాయి పుట్టిన రెండవ యేడు చనిపోయింది. రాజాఖాన్‌కు వెనకాముందు ఎవరూ లేరు. అతనికి మనసుపడితే అది ఎంత కష్టమైనా చేయాలనే పట్టుదల గల మనిషి. మొండితనం కావలసినంత ఉంది. మనసు చిన్న బుచ్చుకుంటే మనమెంత ఓదార్చినా కుదుటపడదు.

నన్ను చూసి మురిసిపోయేవాడు. "అందమనే ముదురు చెట్టుకు కొత్తగా చిగురించిన రెమ్మవలె వున్నావు"అంటూ వచ్చీరాని కవిత్వంతో నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేవాడు.

నా మీద అంత అనురాగమున్న రాజాఖాన్ 'తలాఖ్' యిచ్చాడు. ఒకటి, రెండు సార్లు కాదు మూడుసార్లు ముక్తాయింపుగా చెప్పాడు. ఇంకెప్పుడూ అతనికి చేరువ కాకుండా చేసుకున్నాడు.

ఆ విధంగా యెందుకు మారిపోయాడో యెంత ఆలోచించినా అంతు పట్టడం లేదు. నేను యేం తప్పు చేశానని అంత పెద్ద శిక్ష విధించాడు?

ముగ్గురూ ఆడబిడ్డల్ని కనడమే నేను చేసిన నేరమా? అంతకంటే నాకు కొంచెం విషమిచ్చి ఉండినా సంతోషించేదాన్ని! సజీవంగా ఈ నరకంలో తోసి బాధించడం అతనికి న్యాయమేనా! ఈ ప్రశ్నలు నిత్యం నా అంతరంగాన్ని చిల్లులు కొడుతున్నాయి. ఇక నాకు నిద్ర ఆహారం సహించగలవా!

"వరుసగా ముగ్గురూ ఆడపిల్లలు. మూడవ కానుపయినా కొడుకు పుడతాడని ఎంతో నమ్మకమయింది. ఇప్పుడు అందరూ నన్ను హేళన చేస్తూ చప్పట్లు కొడుతున్నారు. నాకు తల యెత్తుకోకుండా చేశావు. వాళ్ళలో తిరగడానికి మొగమెక్కడం లేదు" ఈ మాటలతో రోజూ నన్ను ఒకటే వేధించడం.

ఆరోజు నుండి అతనిలో అసంతృప్తి బాగా పెరిగింది. అభిమానానికి అడ్డు కట్టలు పడినాయి. అదపా, దడపా వేధింపులు, సాధింపులు ఎక్కువై పోయాయి. మగ పిల్లవాడు కావాలని మోజుంటే ఇంకో పెళ్ళి చేసుకున్నా నాకు అభ్యంతరం లేదన్నాను. ఇద్దరితో ఏగించలేనని తప్పుకునేవాడు.

చెరొకవైపు లాగితే సంసారం బంధం తెగిపోతుందని నేనే సర్దుబాటవుతూ వచ్చాను. ఉన్నట్లుండి అతనే బలవంతంగా తెగ్గొట్టాడు.

అకస్మాత్తుగా యిరువురు సాక్షులతో యింటికి వచ్చాడొకరోజు

తలాఖ్! తలాఖ్!! తలాఖ్!!!

ఆవేశంగా మూడు సార్లు అరిచాడు.

అంతే! చకచకా కుల పెద్దలంతా గుమికూడినారు. నా పెళ్ళప్పుడిచ్చిన పాతిక తులాల బంగారం వాపసు ఇవ్వాలని వాదించారు. ఆడపిల్లలున్నారు యివ్వడానికి వీలుపడదన్నారు రాజాఖాన్ వత్తాసుదార్లు. బంగారం ఇవ్వకపోవడం అన్యాయమని రాజాఖాన్‌ను దబాయించారు పెద్దలు. అందరూ చెబితే వాపసు ఇవ్వడానికి వొప్పుకొన్నాడు రాజాఖాన్. ఇక మహరు, యిద్దతు డబ్బులు తీసుకుని బయలు దేరమన్నారు.

ఆ రోజు నుండి నువ్వు అతని భార్యవు కావని తేల్చేసినారు. బలి పశువు వలె చెవులు ఊపుకుంటూ యిక్కడికి చేరుకున్నాను.

పదినిముషాలలో పది సంవత్సరాల వైవాహిక జీవితానికి తెరపడింది. రాజాఖాన్ పనికిరాని యంత్రాన్ని చేసి పారేశాడు నన్ను. అదే పని ముట్టును ఇంకొకరికి అంటగట్టా లనుకుంటుంది అమ్మీ. నాకు యేడ్పు వచ్చింది. ఈ దినమే కాదు, చాలాకాలంగా యేడ్చి, యేడ్చి నిద్దుర పోవడం అలవాటయి పోయింది నాకు.

* * * *

తెల్లవారుతూనే రోజువలె వీధి గుమ్మంలో కూర్చున్నాను. ట్రంకు రోడ్డు చౌరస్తాలో ఉంది మా యిల్లు. ఎనిమిది గంటలకు గాని రారు వాళ్ళు. ప్రతి రోజు కాన్వెంట్‌కు మా యింటి ముందు నుండే పోతారు. మా ఇంటి ఆవలి సందులో ఉంది కాన్వెంటు. పక్కకు కదలి అటూ, ఇటూ పోతే వెళ్ళిపోతారేమోనని భయం.

ఒక్కరోజు చూడకుంటే 'పోనీలే', అని మనసు చిక్కబట్టుకోలేను. ఎప్పుడెప్పుడు ఎనిమిది గంటలు కొడతాయా అని ఆతృత. మనకు అవసరమైనపుడు కాలం కూడా ఆలస్యంగా సాగినట్లుంటుంది. ఒక్కొక్క క్షణం బరువుగా నా గుండెల మీద నుండి నడుస్తున్నట్లుంది. గుమ్మంలో అట్లే కాచుక కూర్చున్నాను.

ప్రతిరోజు నాతో మాట్లాడుతున్నారని రాజాఖాన్ మందలించాడా? ఈరోజు రాకపోవచ్చా! ఆ మాట అనవద్దని గుండె నోటికి అడ్డు పడుతూంది. వద్దు! ఆ విధంగా జరగకూడదు. అదే జరిగితే నేను భరించుకోలేను. ఈ పాడు ఆలోచనలు వస్తున్నందుకు నన్నునేను విసుక్కున్నాను. రాత్రి పగలు దిగులు నన్ను చిత్రవధచేస్తూంది. నా పిల్లల్ని చూసిన పది నిముషాలే నాకు ఊరట, ఆనందం. వాళ్ళను నా గుండెకు హత్తుకున్నప్పుడు నా బాధంతా ఆవిరైపోతుంది. దాని కోసమే ఈ నిరీక్షణ.

నా పేగులు తెంచుక పుట్టిన అనురాగపు ముద్దలు వాళ్ళు. తియ్యని అనుభూతులతో నవ మాసాలు మోసి కన్నాను. కానీ ఈ రోజు నాబిడ్డలని చెప్పుకునే తాహత్తులేదు. ఇప్పుడు రాజాఖాన్ బిడ్డలు. నాకు ఏమీ కారు.

అదిగో వస్తున్నారు!

"అబ్బ!' అపుడే హాయి చుట్టుకుంది నన్ను. సంతోషంతో పూనకం వచ్చినట్లయింది. స్వర్గం నా దగ్గరకు కదలి వస్తున్నట్లనిపించింది.

"అమ్మీజాన్!" అంటూ ముగ్గురూ పరిగెత్తుకుంటూ వచ్చి నా వడిలో వాలారు. రాజాఖాన్ సంబంధీకులు ఎవరన్నా చూస్తారేమోనని చుట్టూ పరికించాను. వాళ్ళు తీగలవలె పెనవేసు కున్నారు నన్ను. ప్రేమ ఉప్పొంగి కొద్దిసేపు మూగవాళ్ళని చేసింది

మమ్మల్ని. తర్వాత పాలకోవా తినమని అందించాను. చిన్నది నాకు వద్దని మూతి ముడుచుకుంది.

"నువ్వు తినవా రిజ్వానా" అన్నాను.

వద్దని తల అడ్డంగా తిప్పింది.

"ఎందుకని?"

దాని కళ్ళల్లో నీళ్ళు నిండాయి. రెప్పలల్లార్చుతూ నా వైపు దీనంగా చూసింది.

"నన్ను...నన్ను.. ఆమె... కొట్టింది" అంది వచ్చిరాని మాటలతో.

నాహృదయం పిండినట్లయింది. రాజాఖాన్ రెండవ పెళ్ళి చేసుకొని నెల కావచ్చింది. అతని కొత్త భార్య ఇక్కడికి వచ్చి పది రోజులయింది.

"ఎందుకు కొట్టింది?" పెద్దపాప వైపు చూశాను.

అది కోవా తింటూనే "ఏం లేదమ్మీ! రాత్రి పిన్నీ, డాడి ఒకే మంచంమీద పడుకున్నారు. డాడి దగ్గర పడుకొంటానని సతాయించింది రిజ్జు. వద్దు అక్క దగ్గర పడుకోమని రెండుసార్లు నా మంచంమీద పడుకోబెట్టింది పిన్ని. మళ్ళీ లేచి వెళ్ళి పోయింది రిజ్జు. పిన్ని కోపంతో కసురుకొని కొట్టింది."

ఆ మాటలు నా గుండెల్ని ముక్కలు, ముక్కలు చేశాయి. అయినా ఎవరి బిడ్డలు వాళ్ళకు ముద్దు. ఇంకొకరి బిడ్డలు ఇబ్బందిగానే ఉంటారు. తల్లి ఉండి కూడా లేని వాళ్లయ్యారు నా బిడ్డలు.

రిజ్జు తల నిమురుతూ, "మీ డాడి ఏం అనలేదా!" అన్నాను.

"ఉహూ!" అన్నారు పెద్దపిల్లలిద్దరూ.

"దీన్ని నీదగ్గరే పెట్టుకోమ్మీ! రాత్రంతా అమ్మీ!అమ్మీ అని ఒకటేఏడుపు. ఏడిస్తే బయటకుతోసి వాకిళ్ళు మూస్తానని భయపడించారు డాడి. అప్పుడు గాని నోరుమూయ లేదు. "బేవార్సా ముండ! ఎట్ల పుట్టినావే!"అని పొద్దున కూడా తిట్టింది పిన్ని.

ఇంకా యేదో చెప్పబోయింది రెండవ పాప. వద్దని గట్టిగా దాని నోరు మూశాను.

"ఇట్లా వీళ్ళను మురిపెంచేస్తే నిన్ను వదిలిపెట్టరు. దాంతో నీకు బాధ, వాళ్ళకు కష్టాలు తప్పవు. గుండె రాయి చేసుకొని గతాన్ని మరచిపోవాలమ్మా!"–దగ్గరకు వచ్చి నా గడ్డం పట్టుకుని బుజ్జగించింది అమ్మీ.

"నానిమా! నానిమా!" అంటూ అమ్మీను చుట్టుకొన్నారు ముగ్గురు. "మీడాడి చూస్తే కొడతాడు. పోండి! పోండి!" అంటూ బలవంతంగా వాళ్ళను పంపించేసింది అమ్మీ. నేను చూడకుండా అటువైపు తిరిగి కన్నీళ్ళు తుడుచుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

వాళ్ళు వెళ్ళిపోతూ ఉంటే చూస్తూ తల్లడిల్లిపోయాను నేను.

* * * *

సాయంత్రం!

ఆదరాబాదరా అబ్బాజాన్ అంగడి నుండి యిల్లు చేరుకున్నారు. హాల్లో చూర్చున్న నన్ను చూసి నాదగ్గరకు వచ్చారు. "ఏమ్మా! యింకా అట్లే వున్నావు?!" విస్తుపోతూ అడిగారు, నేను లేచి మౌనంగా తల వంచుకున్నాను.

"త్వరగా బట్టలు మార్చుకో. వాళ్ళు సాయంత్రం వస్తామన్నారు" అన్నారు అబ్బాజాన్.

సూటిగా ఆయన కళ్ళలోకి చూశాను.

"నీకు తెలియదమ్మా! మేం చెప్పినట్లు చేయ్" నా తల మీద చెయ్యి పెట్టి నిమిరారు. ఆవేశం నన్ను ఉండనివ్వలేదు. అబ్బాజాన్ ఏమనుకుంటారో అన్న భయం తుడిచి పెట్టుక పోయింది.

"క్షమించండి అబ్బాజాన్! నాకీ పెళ్ళి వద్దు" అన్నాను.

"పిచ్చి పిల్లా! అది మన ధర్మమమ్మా" అన్నారాయన.

"అవును.నేను కాదనలేదు. కానీ కారణం లేకుండా తలాఖ్ యివ్వమని మన ధర్మం చెప్పలేదు. ఈ కాలం విడాకులంటే చాలా తేలికయిపోయింది. తలాఖ్ ఎందుకు ప్రవేశపెట్టారో మీకు తెలుసు ననుకొంటాను అబ్బాజాన్.

భార్యా భర్తలలో పరస్పరం అయిష్టత యేర్పడాలి. ద్వేషభావం విస్తరించి దాంపత్య జీవితం కొనసాగని పరిస్థితి రావాలి. వారిద్దరి మధ్య సఖ్యతకు, సర్దుబాటుకు అవకాశం కనిపించకుండా పోవాలి. ఆ సంబంధం అలాగే కొనసాగించడం శ్రేయస్కరం కాదనే అభిప్రాయం కలగాలి. అటువంటి విధిలేని పరిస్థితుల్లో విడాకులు అమలు పరచాలి. అంతేకాని కుంటి సాకులు చూపి మూడు సార్లు తలాఖ్ అనడం సమంజసం కాదు అబ్బాజాన్".

నా మనస్సులో ఉన్న విషయం కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేశాను అబ్బాజాన్‌కు. ఆయన మౌనంగా తలాడించారు. నా వైపు చూస్తూ కొద్దిసేపు ఆలోచించారు.

"చూడు రజియా సుల్తానా! ఆ పుణ్య, పాపాలు తలాఖ్ చేప్పే వాళ్ళవే. అమలు జర పడమే పెద్దలపని. నువ్వు చదువుకున్న దానివి. నీ యిష్టానికి భిన్నంగా ఏదీ మేము చేయదల్చు కోలేదు. సాటి వారితో మాకు తలవంపులు రాకుండా చూడు"

బాధతో అబ్బాజాన్ కన్నీళ్ళు పెట్టుకున్నారు. ఇంతలో అమ్మీ కూడా మా దగ్గరకు

వచ్చింది. ఆమె నా తల నిమురుతూ "నీకు మంచి జరగాలి. అంతకంటే మాకు కావలసిందే ముంది బేటీ!" అంది.

"అబ్బాజాన్! మూర్ఖులకు భార్యలైన నా వంటి వాళ్ళకు ఈ బాధలు తప్పవు. ఈ ముళ్ళ కంచెలో యిరుక్కుని విలవిలలాడుతున్న నా లాంటి అభాగినులకు చేయూత నివ్వాలను కుంటున్నాను. రాజాఖాన్ వంటి 'మగమహారాజు'లకు గుణపాఠం చెప్పాలని నిర్ణయించు కున్నాను. రేపటి నుండి "లా" కాలేజీలో చేరాలనుకుంటున్నాను. న్యాయవాదినై ఈ అన్యా యాలను ఎదుర్కొనాలని నిశ్చయించుకున్నాను. దయచేసి ఈఅవకాశాన్ని కల్పించండి" ప్రాథేయపడ్డాను.

ఇద్దరూ ఒక్కసారి అశ్చర్యంగా "బేటీ!" అన్నారు.

"మీ కూతురు నిప్పు వంటిదని నిరూపించుకుంటాను...

మన కుటుంబానికి ఏ మచ్చ రానివ్వను. దువా చేయండి" అంటూ ఇద్దరి కాళ్ళూ మొక్కాను.

ఇద్దరూ "అల్లా రక్షించుగాక!"అని నా తల మీద చేతులు పెట్టారు.

వాళ్ళ వేడి కన్నీళ్ళు బొట్లు, బొట్లుగా రాలి నా మెడమీద పడ్డాయి.

"నీ యిష్టమే మా యిష్టం!" అన్నారు యిద్దరూ ఒకేసారి.